రేపటి నుంచి పాఠశాలల్లో ఆధార్ నమోదు

గరుగుబిల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈవో బి.రాజ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ కోసం ఈ చర్యలు చేపడుతున్నామన్నారు. దీనిపై హెచ్‌ఎంలకు ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. జిల్లాలోని 14 మండలాల్లోని 42 పాఠశాలలను గుర్తించామన్నారు. ఆయా ప్రాంతాల్లో విద్యార్థుల ఆధార్ సమాచారాన్ని అందించాలన్నారు. ఆధార్ అప్‌డేట్ కాని వారి వివరాలను విధిగా నమోదు చేయించాలని సూచించారు.



దయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయనున్న సీతంపేట ఏరియా ఆసుపత్రి

సీతంపేటలో డయాలసిస్

- కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- కిడ్నీ బాధితులకు తీరనున్న కష్టాలు

పార్వతీపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి)

ఏజెన్సీ వాసులకు కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. జిల్లాలో మరో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ప్రధానమంత్రి నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాం కింద సీతంపేటలో కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం మంగళవారం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సుమారు రూ.75 లక్షలతో రక్తశుద్ధి యంత్రాలు, పరికరాలు సమకూర్చనున్నారు. పీపీపీ విధానంలో సీతంపేట ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని నిర్వహించనున్నారు. నిర్వహణ బాధ్యతను ఒక ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. రోజూ మూడు సెషన్స్ ద్వారా 15 మందికి డయాలసిస్ చేయనున్నారు. కాగా గిరిజన ప్రాంతంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం డయాలసిస్ కోసం బాధితులు సీతంపేట నుంచి పాలకొండ, పార్వతీపురం, శ్రీకాకుళం తరలి వెళ్లాల్సి వస్తోంది. సీతంపేటలో కేంద్రం ఏర్పాటైతే భామిని, గుమ్మలక్ష్మీపురం, వీరఘట్టం, సీతంపేట మండలాలతో పాటు శ్రీకాకుళం జిల్లా కొత్తూరు, బత్తిలి, హిరమండలం, పాతపట్నం, మెళియాపుట్టి వంటి ప్రాంతాల వాసులకు డయాలసిస్ సేవలు అందుబాటులోకి వస్తాయి.

ప్రత్యేక వార్డు సిద్ధం..

సీతంపేట రూరల్: డయాలసిస్ కేంద్రం కోసం సీతంపేట ఏరియా ఆసుపత్రిలో 15బెడ్‌లతో ప్రత్యేక వార్డును సిద్ధం చేశారు. బాధితులకు సేవలందించేందుకు వైద్య సిబ్బంది అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వాస్తవంగా గత ఏడాది సీతంపేట ఏరియా ఆసుపత్రిలో 5బెడ్‌లతో డయాలసెస్ కేంద్రం ఏర్పాటుకు అనుమతులు వచ్చాయి. అయితే వార్డులు ఖాళీ లేకపోవడంతో తాత్కాలికంగా యూనిట్ ఏర్పాటును నిలిపివేశారు. అయితే కొద్ది రోజుల కిందట ఏరియా ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన పై అంతస్థులో అదనపు వార్డులు సిద్ధమయ్యాయి. దీంతో కింద అంతస్థులో నిర్వహిస్తున్న జనరల్ వార్డులను ఖాళీ చేయించారు. ఆ వార్డులో డయాలసిస్ కేంద్రం నిర్వహణకు సంబంధించి పనులు జరుగుతున్నాయి. దీనిపై సీతంపేట ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావును వివరణ కోరగా ఒక వార్డులో డయాలసిస్ యూనిట్ ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు.



శివ పూజకు వేళాయె

- నేటి నుంచి కార్తీకమాసం
- శివాలయాలు సిద్ధం

పార్వతీపురం/గరుగుబిల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అత్యంత పవిత్రమైనదిగా భక్తులు భావించే కార్తీక మాసం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఈమేరకు జిల్లాలోని వివిధ శివాలయాల్లో భక్తులు పూజలు చేసేందుకు అనువుగా ఏర్పాట్లు చేశారు. వాస్తవంగా కార్తీకంలో నెల రోజుల పాటు శివాలయాలను భక్తులు దర్శించుకుంటారు. సోమవారాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ నేపథ్యంలో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో గుంప, అడ్డాపుశీల, సాలూరు లోని పంచముఖేశ్వర ఆలయం, పాచిపెంట మండలంలోని మంచాడవలస గోకర్ణేశ్వర గుహాలయం, పారమ్మకొండ, తదితర చోట్ల కార్తీక పూజలకు సర్వం సిద్ధం చేశారు. పాలకొండ, భామిని, సీతంపేట, తదితర మండ లాల్లో ఉన్న శివాలయాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక బారికేడ్లు సిద్ధం చేశారు. దీపావళి అమావాస్య తరువాత నుంచి మొదలయ్యే కార్తీకం శివకేశవులకు ప్రీతికర మైన మాసంగా పరిగణిస్తారు. ఈ నెలలో చేసే స్నానాలు, దీపారాధనలు, ఉపవాస దీక్షలకు విశేషమైన ఫలితం ఉంటుందని భక్తుల విశ్వాసం. కార్తీక మాసంలో సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయం తరువాత తలసి కోట వద్ద దీపాలను వెలిగిస్తూనే పరమేశ్వరుడిని పూజిస్తారు. విష్ణు సహస్రనామాలను భక్తులు పఠిస్తారు. ముఖ్యంగా కార్తీక సోమవారాల్లో పరమేశ్వరుడికి చేసే అర్చనలు, అభిషేకాలు చేస్తుంటారు. స్వయంపాక దానాలు, వస్త్ర దానాలు చేసి అత్యంత పుణ్యఫలమని భక్తజనం భావి స్తారు. మరికొందరు నేటి నుంచి అయ్యప్ప, శివ మాలల దీక్ష చేపట్ట నున్నారు. మన్యంలో పిక్నిక్‌ల సందడి కూడా ప్రారంభం కానుంది.

పారదర్శకంగా ధాన్యం సేకరణ

- జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పార్వతీపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పారదర్శకంగా ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం పార్వతీపురం మండలం వెంకంపేటలో ఉన్న రైస్‌మిల్లును ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మిల్లర్లు, రైతు సేవా కేంద్రం సిబ్బందితో మాట్లాడారు. రైతులకు మంచి గోనె సంచులు ఇవ్వాలన్నారు. సాయంత్రం 5గంటల వరకు ట్రక్ షీట్లు జనరేట్ అవుతాయని తెలిపారు. అనంతరం చినబొండపల్లిలోని రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. టార్పాలిన్లు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసు కున్నారు. మిల్లర్లను సమన్వయం చేసుకుంటూ కస్టోడియన్ అధికారులు పనిచేయాలని ఆదేశించారు.



గోనె సంచులను పరిశీలిస్తున్న జేసీ

నిధులు మంజూరైనా ముందుకు రాలే!

- ఇంకా ప్రారంభంకాని పూర్ణపాడు - లాబేసు వంతెన పనులు
- టెండర్లు పిలిచినా ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు
- అదనపు నిధుల కోసం ఈఎన్‌సీకి లేఖ రాయనున్న అధికారులు
- త్వరగా నిర్మాణం పూర్తి చేయాలంటున్న ప్రజలు

పార్వతీపురం/జియ్యమ్మవలస, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కురుపాం నియోజకవర్గంలో ఉన్న ముఖ్య సమస్యల్లో పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణం ఒకటి. ఏళ్లు గడుస్తున్నా దీని పనులకు మోక్షం లభించడం లేదు. దీంతో ఆయా ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవంగా గత టీడీపీ ప్రభుత్వ హయాం (2014-19)లో 80 శాతం వంతెన పనులు పూర్తయ్యాయి. కానీ ఆ తరువాత వచ్చిన వైసీపీ సర్కారు 20 శాతం పనులను పూర్తి చేయించలేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వంతెన నిర్మాణంపై దృష్టి సారించింది. ఇటీవల నిధులు కూడా మంజూరు చేసింది. అయితే టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అధికారులు తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నారు. అదనపు నిధుల కోసం ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ)కి లేఖ రాయనున్నట్లు వారు చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

- కొమరాడ మండలాన్ని రెండుగా విభజించేది నాగావళి నది. ఈ మండలంలో 31 పంచాయతీలు, 154 గ్రామాలు ఉన్నాయి. నాగావళి నదికి తూర్పు వైపు దళాయిపేట, మాదలింగి, గుణదతీలేసు, కెమిశీల, కొట్టు, తొడుము, పాలెం, వన్నాం పంచాయతీలు, వాటి పరిధిలో 38 గ్రామాలు ఉన్నాయి. ఈ ప్రాంత ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు పడుతున్న బాధలు వర్ణనాతీతం, వీరు మండల కేంద్రానికి వెళ్లాలంటే 75 కిలో మీటర్లు ప్రయాణించాల్సిన దుస్థితి. మండల అధికారులు ఈ ప్రాంతానికి రావాలంటే అంతే దూరం ప్రయాణించాలి. పూర్ణపాడు - లాబేసు వంతెన పూర్తయితే ఆయా ప్రాంతవాసులు 25 కిలో మీటర్లు ప్రయాణిస్తే చాలు మండల కేంద్రానికి వెళ్లిపోతారు.
- వర్షా కాలంలో ఆ గ్రామస్థులు నాగావళి నదిపై పడవలో ప్రయాణించి మండల కేంద్రానికి వెళ్లాల్సిన దుస్థితి. గతంలో ఆంధ్రా - ఒడిశా సరిహద్దు వనజ గ్రామం వద్ద నాటు పడవ మునిగిపోయి 35 మంది చనిపోయారు. వీరందరూ కురుపాం, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ మండలాలకు చెందిన వారే. ఈ నేపథ్యంలో అటువంటి ఘటనలు పునరావృతం కాకముందే పూర్ణపాడు - లాబేసు వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.



పూర్ణపాడు-లాబేసు వంతెన ఇలా..

గతంలో ఇలా..

- పూర్ణపాడు - లాబేసు వంతెన పనులు 2006లో శ్రీకారం చుట్టారు. రూ. 3.20 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయిస్తూ ఈ బాధ్యతను గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగానికి అప్పగించారు. 2009 జూన్ 3న టీడబ్ల్యూ ఇంజనీరింగ్ విభాగాన్ని తప్పించి ఆర్ అండ్‌బీ ఇంజనీరింగ్ శాఖకు ఆ బాధ్యతలు అప్పగించారు. 2010, మార్చి 22న పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి పనులు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
- 2011, ఏప్రిల్ 27న ఈ వంతెన నిర్మాణ వ్యయం

(మిగతా 8వ పేజీలో...)

హైడ్రో పవర్ 8లో

ప్రాజెక్ట్ వద్దు

- మంత్రి సంధ్యారాణిని కోరిన గిరిజనులు

ఆనందోత్సాహాలతో

‘దీపావళి’

- వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు
- రూ. 2కోట్లకు పైబడి బాణసంచా విక్రయాలు..

8లో

గ్రామీణ రోడ్లకు

మహర్దశ

- రూ. 14.50 కోట్లతో త్వరలో పనులు ప్రారంభం

పర్యాటక ప్రాంతాల

అభివృద్ధికి చర్యలు

- వెల్లడించిన ఉపాధి హామీ పథకం ఏడీలు

8లో

వైభవం.. ఉయ్యాల కంబాల ఉత్సవం

- నేడు చండీహోమం..
- ముగియనున్న పైడిమాంబ భక్తుల దీక్షాధారణ

విజయనగరం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ సిరిమానోత్సవంలో చివరి ఘట్టమైన ఉయ్యాల కంబాల ఉత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఈ ఉత్సవం పురస్కరించుకుని నగరంలోని పైడిమాంబ చదురుగుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. పిండి వంటలతో కూడిన ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. ఉదయం 4.45 గంటలకు సుప్రభాత సేవ అనంతరం భక్తులకు పైడిమాంబ దర్శనాన్ని కల్పించారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ భక్తులు అధిక సంఖ్యలో పైడిమాంబను దర్శించుకున్నారు. దీంతో చదురుగుడి, వనంగుడి భక్తజనంతో కోలాహలంగా కన్పించాయి. రాత్రి 7.30 గంటలకు ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు చదురుగుడి వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉయ్యాలలో పైడిమాంబ ఉత్సవ విగ్రహాన్ని ఉంచి పూజలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ఉయ్యాల కంబాల ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కాగా అమ్మవారి ఆలయంలో బుధవారం చండీహోమం జరుగనుంది. ఇదే రోజు పైడిమాంబ భక్తులంతా దీక్షలను విరమించనున్నారు.



ఉయ్యాల కంబాల సేవలో అమ్మవారి ప్రతిమతో అర్చకుడు



ఏనుగుల బీభత్సం

కొమరాడ, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలంలోని సోమినాయుడువలస, కుమ్మరిగుంట గ్రామాల పరిధిలోని ఏనుగుల గుంపు మంగళవారం బీభత్సం సృష్టించాయి. అరటి, వరి పంటలను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమన్నారు. ప్రస్తుతం గజరాజులు రావికరవలస చెరువుకు చేరుకోవడంతో ఆ ప్రాంతవాసులు భయాందోళన చెందుతున్నారు. తక్షణమే ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

క్షతగాత్రులకు మెరుగైన చికిత్స

- ఘటనపై కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు
- డీపీటీవో వెంకటేశ్వరరావు

పార్వతీపురం, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సంభవించిన బాణసంచా పేలుడు ఘటనలో తీవ్ర గాయాల పాలైన వారికి మెరుగైన చికిత్స అందిస్తున్నామని జిల్లా ప్రజారవాణా అధికారి(డీపీటీవో) డి.వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. దీనిపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతుందన్నారు. మంగళవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. ‘ఈ నెల 19న ఉదయం 9.30 గంటలకు విజయనగరం ఆర్టీసీ డిపో పరిధిలో ఉన్న పార్శిల్ కౌంటర్‌లో కుమార్ అనే వ్యక్తి పార్వతీపురానికి కిషోర్ పేరుతో 25 కేజీల ఫ్యాన్సీ సామాగ్రిని బుక్ చేశారు. ఆ పార్శిల్‌ను విజయనగరంలో 10.15 గంటలకు బస్సులో లోడ్ చేయగా, మధ్యాహ్నం 12..50 గంటలకు అది పార్వతీపురం చేరింది. ఆ సమయంలో లాజిస్టిక్స్ కౌంటర్ వద్ద ఉన్న హమాలీ బస్సు వద్దకు వెళ్లారు. డిక్కీ నుంచి పార్శిల్ బయటకు తీసి లాజిస్టిక్స్ కౌంటర్ వద్ద పెడుతున్న క్రమంలో పేలుడు సంభవించింది. దీంతో హమాలీ, బస్సు డ్రైవర్, అక్కడే ఉన్న రిక్షా పుల్లర్, మరో వ్యక్తి క్షతగాత్రులయ్యారు. వెంటనే వారిని 108 సాయంతో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించాం. అనంతరం విశాఖ, విజయనగరం ఆసుపత్రులకు తరలించాం.’ అని ఆయన వెల్లడించారు.



సమాజ రక్షణలో పోలీసుల పాత్ర కీలకం

- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి
- పార్వతీపురంలో పోలీసు అమరవీరుల దినోత్సవం

బెలగాం, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): సమాజ రక్షణ, అంతర్గత భద్రతలో పోలీసుల పాత్ర కీలకమని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరుల స్థూపం వద్ద ఘన నివాళి అర్పించారు. పోలీస్ శాఖ పని తీరు, ప్రభుత్వ సహకారాన్ని కలెక్టర్ ప్రశంసించారు. అమరవీరుల స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించి.. అమరులైన వారి సేవలు ఎప్పటికీ మరువలేమని ఎస్పీ మాధవరెడ్డి కొనియాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు బలగాలు విశేష సేవలందిస్తున్నాయన్నారు. వారి త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ.. అహర్నిశలు శ్రమించే వారిని గౌరవించడం అందరి బాధ్యత అని తెలిపారు. అనంతరం అమరులైన పోలీసు కుటుంబ సభ్యులకు చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, ఏఎస్పీ అంకితా సురాన, పాలకొండ డీఎస్పీ రాంబాబు, ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, సీఐ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు

వైద్య సేవల్లో నిర్లక్ష్యం తగదు

వంగర, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో జీవనరాణి ఆదేశించారు. మంగళవారం ఆమె స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు కనీస సదుపాయాలు అందే విధంగా చూడాలన్నారు. గ్రామాల్లో నిర్వహించాల్సిన తనిఖీలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు పెంచేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

నేడు విద్యుత్ నిలుపుదల

గజపతినగరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో గల చల్లపేట ఫీడర్ వద్ద చెట్టు కొమ్మల తొలగింపుతో పాటు మరమ్మతుల కారణంగా మండలంలోని 11 గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు బొబ్బిలి డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ రఘు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగచోళ్లపెంట, పట్రువాడ, కొత్తబగ్గాం, పాతబగ్గాం, బంగారమ్మపేట, భూదేవిపేట, దావాలపేట, బూడపేట, కోనిస, సాలిపేట, చిటయ్యవలస గ్రామాల్లో ఉదయం 8నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

లక్కవరపుకోట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చందులూరు జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి వై.చరణ్‌కుమార్, కార్తీక్, ఎర్రమ్మలు అనే ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ శ్రీరాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరు ఈనెల 22, 23 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు హాజరవుతారని చెప్పారు. వీరి ఎంపిక పట్ల పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

స్టాకు ఉంచొద్దు

భోగాపురం, అక్టోబరు 21(భోగాపురం): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చిన స్టాకు ఎప్పటికప్పుడే పంపిణీ చేస్తుండాలని, నిల్వ ఉంచకూడదని ఐసీడీఎస్ భోగాపురం ప్రాజెక్టు అధికారి లావణ్య హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ప్రాజెక్టు స్థాయిలో అంగన్‌వాడీ వర్కర్లకు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్యకర్తలు, ఆయాలు నిర్ణీత సమయాల్లో కేంద్రాల్లో ఉండాలని ఆదేశించారు. సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వసతిగృహం తనిఖీ

వేపాడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కొండగంగూబూడి బాలుర వసతిగృహాన్ని స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మంగళవారం సందర్శించారు. వార్డెన్ సురేష్ ఆధ్వర్యంలో చేస్తున్న వంటను రుచిచూశారు. వసతిగృహానికి ఎమైనా అవసరమైతే తనను కోరవచ్చన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. దాసరి కార్పొరేషన్ ఛైర్మన్ రత్నాజీ, పీఏసీఎస్ ఛైర్మన్ కోళ్ల శ్రీను, మాజీ సర్పంచ్ వెంకటరావు పాల్గొన్నారు.


సీసీ కెమెరాల ఏర్పాటు

రాజాం రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ సాధ్యపడుతుందని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ అన్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు యలకల సురేష్ సమకూర్చిన ఎనిమిది సీసీ కెమెరాలను మంగళవారం ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సీఐ దగ్గరుండి ఏర్పాటు చేయించారు. ఏఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

నేడు మంత్రి రాక

మెంటాడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి బుధవారం మెంటాడ మండలంలో పర్యటించనున్నారు. కొండలింగాలవలస నుంచి గజంగుడ్డివలస వరకు రూ.కోటి 50లక్షల అంచనా వ్యయంతో మంజూరైన బీటీ రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేయనున్నారు.

శివయ్యకు కిరణ స్పర్శ



రాజాం/ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రారంభమైన వేళ.. సోమవారం రెండు వేర్వేరు శివాలయాల్లో శివలింగాలకు సూర్యుని కిరణాలు తాకాయి. రాజాం మండలం గురవాంలోని ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు రాజాం పట్టణంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో ఈ అద్భుతం చోటుచేసుకుంది.

అమృత హస్తం పథకానికి విరాళం

చీపురుపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కొంత మంది సామాజిక సేవా కార్యకర్తలు నడుపుతున్న అమృత హస్తం అన్నదాన పథకానికి మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు మనుమడు వేలూరి అమోఘ్ రూ.10వేలు విరాళంగా ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రూప్-1లో ఎంపికై కమర్షియల్ ట్యాక్స్ అధికారిగా ఉద్యోగం పొందిన సందర్భంగా ఆయన ఈ విరాళాన్ని అందజేశారు. సోమవారం ఆసుపత్రి వద్ద ఆయన ఈ మొత్తాన్ని పథక నిర్వాహకుడు బీవీ గోవిందరాజులుకు అందజేశారు. గద్దే బాబూరావు, ఆయన సతీమణి గద్దే వెంకటనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలను పరిష్కరించాలి

భోగాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రీన్ అంబాసిడర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు బి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన వారితో కలిసి స్థానిక ఎంపీడీవో డీడీ స్వరూపరాణికి వినతిపత్రం అందజేశారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

- గెడ్డల్లోని ఇసుక స్థానిక అవసరాలకే..
- కలెక్టర్ రామసుందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా ఇసుక అక్రమ రవాణా, తవ్వకాలు జరగకుండా చూడాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని చిన్న చిన్న నదులు, గెడ్డల్లో అనుమతి పొందిన థర్డ్ ఆర్డర్ రీచుల్లో దొరుకుతున్న ఇసుక ఆయా గ్రామాల అవసరాలకు మాత్రమేనని, ఇతర ప్రాంతాలకు రవాణా చేయడానికి అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. వారికి ఇస్తున్న కూపన్లపై తప్పనిసరిగా తేదీ, పంచాయతీ కార్యదర్శి సంతకం ఉండాలన్నారు. ఇలాంటి రీచుల్లో ఎక్కడా ఇసుక తవ్వకానికి మిషన్లు వాడకూడదని, వాడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇష్టానుసారం ఇసుక తవ్వకాలు చేయకుండా, అనుమతి పొందిన 48 థర్డ్ ఆర్డర్ ప్రదేశాల్లోనే ఇసుక తవ్వకాలు జరపాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం ఇసుక లభ్యత, డిమాండ్‌పై సమీక్షించారు. ఈసందర్భంగా జేసీ సేతు మాధవన్ మాట్లాడుతూ థర్డ్ ఆర్డర్ రీచ్‌లు 48 ఉన్నాయని, రెండు స్టాకు పాయింట్ల ద్వారా నాణ్యమైన ఇసుకను శ్రీకాకుళం జిల్లా నుంచి తెప్పించి అందుబాటులో ఉంచామని వివరించారు. గనుల శాఖ డీడీ సీహెచ్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ జిల్లాలో ఏడాదికి సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం ఉంటుందని, ఈ మేరకు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. కొత్తవలస వద్ద ఇసుక స్టాక్ పాయింట్ ప్రతిపాదన పెండింగ్‌లో ఉందని చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ థర్డ్ ఆర్డర్ రీచ్‌ల జాబితాను తహసీల్దార్లు, పోలీసులకు అందజేయాలన్నారు. డీసిల్టింగ్ పూర్తయిన చోట, నాణ్యత తక్కువతో లభించే ఇసుకను ఫిల్లింగ్‌కు వినియోగించేలా చూడాలని సూచించారు. అలాగే అక్రమ మట్టి, గ్రావెల్ తవ్వకాలపై దృష్టి పెట్టాలన్నారు. జేసీ సేతు మాధవన్, డీటీసీ మణికుమార్, మైన్స్ డీడీ సూర్యచంద్రరావు, ఆర్డీవోలు కీర్తి, ఆశయ్య పాల్గొన్నారు.

● ఆంధ్రప్రదేశ్ ప్రో చైల్డ్ గ్రూపు, చైల్డ్ రైట్స్ ఫోరం రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆవిష్కరించారు. మిషన్ వాత్సల్య పథకం అమలులో భాగంగా రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ, సమీక్ష, జిల్లా, గ్రామ స్థాయి శిశు సంక్షేమ, పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలన్న నిబంధనల మేరకు పరిరక్షణ కోసం బాలల సంక్షేమ పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఐసీడీఎస్ పీడీ విమలరాణి, చైల్డ్ రైట్స్ ఫోరం కన్వీనర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

వంద పరిశ్రమల స్థాపనే ధ్యేయం

- ఎమ్మెల్యే నాగమాధవి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

డెంకాడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల నియోజకవర్గంలో వంద పరిశ్రమలు స్థాపించడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. మంగళవారం డెంకాడ వెలుగు కార్యాలయంలో ఎంఎస్ఎంఈ సౌజన్యంతో ఏర్పాటుచేసిన పారిశ్రామికవేత్తల శిక్షణా కార్యక్రమాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంప్రదాయ పద్ధతులను పాటించి 78 రకాల ఉత్పత్తులతో వంద పరిశ్రమలు స్థాపించే విధంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిరాకిల్ సీఈవో లోకం ప్రసాదు మాట్లాడుతూ ప్రతి పంచాయతీ నుంచి పారిశ్రామికవేత్తలను తయారు చేయడం తమ లక్ష్యమన్నారు. ఎంపీపీ బి.వాసుదేవరావు, ఎంపీడీవో భవాని, దాడిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పురమిత్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి

విజయనగరం టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు పురపాలక సేవలను మరింత సులభతరం చేయడానికి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పుర మిత్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందని నగర పాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ప్లేస్టోర్ నుంచి యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుని దాని ద్వారా మున్సిపల్ సేవలు, ఫిర్యాదులు, పన్ను చెల్లింపులు, జనన, మరణ, నివాస ధ్రువీ కరణ పత్రాలతో పాటు 122 పుర సేవలను పొందవచ్చన్నారు.

ఇసుక తవ్వకాలపై చర్యలు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తాటిపూడి వద్ద నూతనంగా నిర్మించిన వంతెన వద్ద ఇసుక తవ్వకాలపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో 'ఆగని ఇసుక తవ్వకాలు' అనే వార్త ప్రచురితమయ్యింది. దీనిపై కలెక్టర్ రామసుందర్‌రెడ్డి స్పందించారు. దీనిపై వెంటనే నివేదిక ఇవ్వాలని ఆయన ఆదేశించడంతో తహసీల్దార్ శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి వెళ్లి, తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. తమ నివేదికను కలెక్టర్‌కు అందిస్తామన్నారు. ఆర్ఐ మనోజ్‌కుమార్, వీఆర్వో నాయుడు ఉన్నారు.

మద్యం సీసాల తొలగింపు

భోగాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భోగాపురం సచివాలయం సమీపంలో గల రైతు సేవా కేంద్రంలో ఉన్న మద్యం సీసాలను ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది సోమవారం తొలగించారు. ఈనెల 20న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన రైతు సేవా కేంద్రంలో మద్యం సీసాలు' అనే కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించారు. ఈ మేరకు అక్కడికి చేరుకుని.. గుట్టలుగా పోగులు వేసిన మద్యం సీసాలను తొలగించారు.

బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

చీపురుపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆంజనేయపురంలో మంగళవారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. చీపురుపల్లి నుంచి గరివిడి వైపు బైకుపై వెళ్తున్న పట్టణానికి చెందిన తలచుట్ల శ్రీను అనే వ్యక్తిని ఆంజనేయపురం సమీపంలో విజయనగరం వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై పడిపోయిన శ్రీను గాయాలపాలయ్యాడు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే అదితి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విజయనగరం నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పట్టణ, మండల స్థాయి అనుబంధ కమిటీల పార్టీ ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతనంగా పార్టీ కమిటీల్లో అవకాశం పొందినవారు తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రతినిధులు ఐవీపీ రాజు, గంటా పోలినాయుడు, గంటా రవి, విజ్జా ప్రసాద్, నర్సింగ్‌రావు, గాడు అప్పారావు, బేగం తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ఎల్.కోట: చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 43 మందికి సీఎంఆర్ఎఫ్ నుంచి సుమారు రూ.28 లక్షలు మంజూరయ్యింది. ఈ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మంగళవారం లక్కవరపుకోటలోని తన క్యాంపు కార్యాలయంలో బాధితులకు పంపిణీ చేశారు. జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ.రాంప్రసాద్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



భోగాపురం: చెక్కులు అందజేస్తున్న బంగార్రాజు

● భోగాపురం: పేదలు కష్ట సుఖాల్లో కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. మంగళవారం పోలిపల్లి గ్రామంలో ఆయన రూ.3.35 లక్షలు విలువగల సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు అందజేశారు.

కుళాయి కనెక్షన్లలో అవకతవకలపై చర్యలు చేపట్టాలి

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా చేపట్టిన ఇంటింటి కుళాయి కనెక్షన్ల అవకతవకలపై దర్యాప్తు చేపట్టి, చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సుమారు 350 గ్రామాలకు కుళాయి కనెక్షన్ల సదుపాయం కల్పించినట్టు జల్‌జీవన్ మిషన్ వెబ్‌సైట్‌లో పేర్లుతో సహా చూపించారని, అయితే కేవలం 50-60 శాతం మాత్రమే ఆ గ్రామాల్లో ఏర్పాటు చేశారని అన్నారు. కుళాయి సదుపాయం కల్పించినట్టు ప్రభుత్వ రికార్డుల్లో చూపిస్తున్న పేర్ల జాబితాను, గ్రామాల్లో అందరికీ తెలిసే విధంగా సచివాలయంలో సభను ఏర్పాటు చేసి నిజ నిర్ధారణ చెయ్యాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనుల తీరుపై దళితుల ఆగ్రహం

లక్కవరపుకోట: మండలంలో చేపడుతున్న జలజీవన్ మిషన్ పనులపై దళితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటి కుళాయి పేరుతో ఎక్కడపడితే అక్కడ సీసీ రోడ్లు, డ్రైన్లు తవ్వేసి వదిలి వెళ్లిపోయారని.. దీంతో నానా అవస్థలు పడుతున్నామని తామరాపల్లి గ్రామానికి చెందిన దళితులు మంగళవారం రోడ్డెక్కారు. ఏ గ్రామంలో చూసినా రోడ్లు, కాలువలు చిందరవందరగా ఉన్నాయని ఆందోళన వ్యక్త చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని వారు మండిపడ్డారు. తామరాపల్లిలో దళితవాడకు వెళ్లడానికి దారిలేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మెరుగైన వైద్యం అందించాలి

నెల్లిమర్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజలకు 104 వాహనం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డా.పీసీవీఏ సాయిరాం సూచించారు. కొండలగాడ పీహెచ్‌సీ పరిధిలోని పూతికపేట గ్రామంలో ఉన్న 104 వాహనాన్ని ఆయన మంగళవారం తనిఖీ చేశారు. వాహనంలోని వైద్య పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా.. లేదా.. అని పరిశీలించి ఏరోజు ఎక్కడ వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. రోజుకు ఎంతమంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందిస్తున్నారన్న విషయాలపై ఆరా తీశారు. అనంతరం వాహనంలోని మందులు, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వాహన సిబ్బంది జగన్మోహన్, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

నెల్లిమర్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్న చర్చిలపై చర్యలు తీసుకోవాలని హిందూ ధర్మరక్షా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.వేణుగోపాలరావు, బీజేపీ మండల అధ్యక్షుడు మైపాడ ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నెల్లిమర్ల తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నగర పంచాయతీతోపాటు రూరల్ మండలంలోని గ్రామాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా చర్చిలు వెలుస్తున్నాయని చెప్పారు. అలాగే ఈనెల 14న నెల్లిమర్ల గ్రామదేవత పూడమ్మతల్లి చదురు గుడి, రామమందిరం వద్ద హిందూ దేవుళ్లను దూషించి మత మార్పిడిలకు పాల్పడిన గోస్పెల్ ఆఫ్ కింగ్‌డమ్ చర్చి పాస్టర్ ఇమ్మాన్యుల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. హిందూ ధర్మ రక్ష సమితి జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మోహనరావు, ఎన్‌వీ కృష్ణారావు, లీగల్ సెల్ ప్రతినిధి పి.గణపతిరావు, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నారాయణమూర్తి ఉన్నారు.

క్రీడల్లో రాణించాలి

భోగాపురం, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. మంగళవారం భోగాపురం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జోనల్ స్థాయి అండర్-17 బాల బాలికల వాలీబాల్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ పోటీల్లో 180మంది బాలు రు, 40 మంది బాలికలు పాల్గొనగా.. జిల్లా స్థాయి పోటీలకు 12 మంది బాలురు, 12 మంది బాలికలను ఎంపిక చేశారు. సాఫ్ట్‌బాల్ సెక్రటరీ శేఖర్, డివిజన్ స్థాయి స్పోర్ట్స్ ఇన్‌చార్జి తవిటయ్య, వ్యాయామ ఉపా ధ్యాయుడు కేవీఏఎన్ రాజు, మండల ఇన్‌చార్జి సిగిడి నాగన్న పాల్గొన్నారు.



పోలీసు అమర వీరులకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

అమర వీరుల సేవలు వెలకట్టలేనివి

డెంకాడ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసు అమర వీరుల సేవలు వెలకట్టలేనివని ఐదో పోలీసు బెటాలియన్ కమాండెంట్ పద్మనాభరాజు అన్నారు. మంగళవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా చింతలవలస వద్ద గల పోలీసు బెటాలియన్ ఆవరణలో పోలీసు అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ఈసందర్భంగా అమరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికను అందజేశారు. అడిషనల్ కమాండెంట్ జీవీ ప్రభాకరరావు, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.బాహుజీ, ఎం.గోపాలకృష్ణ, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్ష



రిలే దీక్షలో నినాదాలు చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల తీరు రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా ఉందని జిందాల్ నిర్వాసితులు అన్నారు. మంగళవారం బొడ్డవరలో వారు 124 రోజు నిరసనలో భాగంగా రిలే దీక్ష కొనసాగించారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా మంత్రి, ఎంపీ వంటివారు తమ సమస్యలను ముఖ్యమంత్రికి వివరించకుండా నొక్కి పెడుతున్నారన్నారు.

● మండలంలోని నాలుగు పంచాయతీల గిరిజన, హరిజన, మైనార్టీలు 18 ఏళ్ల కిందట జిందాల్ పరిశ్రమకు భూములు ఇచ్చి, మోసపోయారు.. వారు గత నాలుగు నెలలుగా శాంతియుత పోరాటం చేస్తుంటే కలెక్టర్ ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రశ్నించారు. మంగళవారం బొడ్డవర గ్రామంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్వాసితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత కలెక్టర్‌కు మాత్రమే ఉందని, పేర్ల పంపిణీ, ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ అమలు వంటివి కలెక్టర్ చూడాలని.. అయితే ఇవేమి జిల్లా అధికారులకు పట్టకపోవడం దారుణమన్నారు.

పెళ్లయిన ఏడాదికే..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గుర్ల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పెళ్లయిన ఏడాదికే ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గుర్ల మండలంలోని కొండగండ్రేడు గ్రామానికి చెందిన రేజేటి పాపినాయుడు(28) ఆదివారం బైకుపై వెళ్తుండగా ఫకీరుకిట్టలి జంక్షన్ సమీపంలో అదుపుతప్పి పడిపోయాడు. క్షతగాత్రుడిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య మౌనిక ఉంది. మృతునికి వివాహమై సంవత్సరం కావస్తోంది. ఆదివారం భార్యకు సీమంతం చేసి సాయంత్రం సరదాగా బైకుపై బయటకు వెళ్లిన పాపినాయుడు ఈ ప్రమాదానికి గురయ్యాడు. పాపినాయుడు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అర్ధాంతరంగా మృతిచెందడంతో భార్య, బంధువుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఆనందపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం-పెందుర్తి జాతీయ రహదారిలోని మామిడిలోవ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్తకు తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు సీఐ చింతావాసునాయుడు మంగళవారం తెలిపారు. విజయనగరం జిల్లా వేపాడ మండలం కృష్ణంరాయుడుపేటకు చెందిన పాలిక లక్ష్మణ్ (28), భార్య పాలిక నూకరత్నం (22) పెందుర్తి సమీపంలోని కరకవానిపాలెంలో నివాసముంటున్నారు. వీరిద్దరూ ఆనందపురం జంక్షన్‌లోని పువ్వులు కొనుగోలు చేయడానికి ద్విచక్రవాహనంపై సోమవారం తెల్లవారుజామున బయలుదేరారు. పెందుర్తి నుంచి ఆనందపురం జంక్షన్‌కు సర్వీసు రోడ్డులో వస్తుండగా.. మామిడిలోవ సమీపంలో ఉన్న కోకోకోలా కంపెనీ వద్దకు వచ్చేసరికి ఎదురుగా అతివేగంగా వస్తున్న వ్యాన్ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న పాలిక నూకరత్నంకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త లక్ష్మణ్‌కు బలమైన గాయాలయ్యాయి. సంఘటనా స్థలంకు చేరుకున్న పోలీసులు నూకరత్నం మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తీవ్ర గాయాల పాలైన లక్ష్మణ్‌ను చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కుమిలి వద్ద వీఆర్వో..

పూసపాటిరేగ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమిలి గ్రామం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చౌడవాడ సచివాలయానికి చెందిన వీఆర్వో తిరుమలరాజు అప్పలనరసింహరాజు అక్కడికక్కడే మృతి చెందారు. చింతపల్లిలో ఉద్యోగ బాధ్యతలు ముగించుకుని విజయనగరంలోని తన నివాసానికి బైకుపై వెళ్తున్న సమయంలో కుమిలి వద్ద రోడ్డుపై ఆగిఉన్న ట్రాక్టరును ఢీకొట్టారు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. స్థానికులు ఈయనను గుర్తించి వెంటనే తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం అందజేశారు. ఈ కార్యాలయ సిబ్బంది స్థానిక ఎస్ఐ దుర్గాప్రసాద్‌కు సమాచారం అందజేశారు. వెంటనే రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అదే విధంగా స్థానిక ఎస్ఐ అక్కడకు చేరుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నారు. మృతుడికి ఒక కుమారుడు, భార్య ఉన్నారు. కుమారుడు అమెరికాలో ఉంటున్నారు. ఈయన ఆకస్మిక మృతి పట్ల రెవెన్యూ సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి చెందారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి..

బాడంగి, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ బి.ఈశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సోమవారం పిండ్రంగివలస ఎల్‌సీ గేటు సమీపంలో దాదాపు 55 ఏళ్ల వ్యక్తి మృతి చెందినట్టు గుర్తించామన్నారు. రైలు ఢీకొని గానీ, రైలు నుంచి జారిపడి గానీ మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నామన్నారు. మృతుడు తెల్ల టీషర్టు ధరించి ఉన్నాడని, దానిపై సర్దార్ వల్లభాయ్ పటేల్ ఫొటో, ఏక్తా దివస్ కొండాపడ బీజేపీ అని ఒరియా భాషలో రాసి ఉందన్నారు కాషాయం రంగు టవల్, పసుపు రంగు దుప్పటి, గులాబీ రంగు లుంగీ ధరించి ఉన్నాడన్నారు. చేతి సంచిలో చిల్లర పైసలు, బియ్యం ఉన్నాయన్నారు. మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 9490617089, 8309901038లను సంప్రదించాలని సూచించారు.

విశాఖలో యువకుడి ఆత్మహత్య

- మృతుడు విజయనగరం జిల్లా గుర్ల వాసి

ఆరిలోవ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లాలో జాతీయ రహదారికి ఆనుకుని ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాల నుంచి విశాఖ వేలీ స్కూలుకు వెళ్లే మార్గంలో తుప్పల్లో చెట్టుకు ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా గుర్లకు చెందిన కె.దామోదరం (30) చోరీలు చేస్తుంటాడు. ఈ క్రమంలో అతడు ఓ కేసులో శిక్షణ అనుభవించి రెండు రోజుల కిందట విశాఖ కేంద్ర కారాగారం నుంచి విడుదల అయ్యాడు. ఇతడి తల్లిదండ్రులు హైదరాబాద్ ఉంటారు. మంగళవారం సాయంత్రం తమకు జూ సమీపంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించామని, మృతుడు దామోదరంగా గుర్తించామని సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించినట్టు చెప్పారు. అతడి ఆతహత్యకు కారణాలు తెలియలేదని, కుటుంబ సభ్యుల కు సమాచారం అందించినట్టు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

దాడిలో ఒకరికి గాయాలు

సంతకవిటి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సంతకవిటికి చెందిన చాపా రాంబాబు అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన జనార్దనరావు ఐరన్ రాడ్‌తో దాడి చేశాడు. ఈ ఘటనలో రాంబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. దీనిపై ఎస్ఐ ఆర్.గోపాలరావు మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి స్థానిక బస్టాండ్ ఆవరణలో ఉన్న రాంబాబును జనార్ధనరావు తిట్టాడు. ఎందుకు తిడుతున్నావని అడిగినందుకు జనార్దనరావు సమీపంలో ఉన్న ఐరన్ రాడ్‌తో రాంబాబు తలపై కొట్టాడు. దీంతో రాంబాబు స్పృహ కోల్పోయాడు. దీంతో జనార్దనరావు తన ఆటోలోనే రాంబాబును ఎంపీపీ పాఠశాల వద్ద విడిచి పెట్టి వెళ్లిపోయాడు. అక్కడ పడిఉన్న రాంబాబును చూసి పాపినాయుడు అనే వ్యక్తి దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. అక్కడ నుంచి రాంబాబు మెరుగైన చికిత్స కోసం రాజాంలోని ఓ ఆసుపత్రిలో చేరాడు. మంగళవారం రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్రీవెన్స్‌లో ఫిర్యాదుపై ఆర్డీవో విచారణ

గజపతినగరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గజపతినగరం పంచాయతీ శివారు గ్రామం ఎం.వెంకటాపురంలోని తనకు ఉన్న ఇంటి స్థలం తనకు అప్పజెప్పాలని కోరుతూ అదే గ్రామానికి చెందిన తాడ్డి నానాజీ ఇటీవల గ్రీవెన్స్‌లో చేసిన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బొబ్బిలి ఆర్డీవో మోహనరావు మంగళవారం ఆ గ్రామానికి వెళ్లి ఆ స్థలాన్ని పరిశీలించారు. గతంలో తహసీల్దార్ బి.రత్నకుమార్ పరిశీలన చేపట్టగా.. అది చంపావతి వంతెన గట్టు అని నిర్ధారించారు. దీంతో ఫిర్యాదుదారుడు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఆర్డీవో వచ్చి స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో శ్రీరాంమూర్తి పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

శృంగవరపుకోట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వనున్నదని ఎంపీడీవో సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంటు, టైలరింగ్, కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్, ఎంబ్రాయిడరీ, శారీ, పెయింటింగ్, జ్యూట్ బ్యాగుల తయారీ, అగరవత్తుల తయారీతో పాటు పుట్టగొడుగుల పెంపకం (స్త్రీ, పురుషులు), పురుషులకు కంప్యూటర్ హార్డ్‌వేర్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేర్, సర్వీసింగ్, టూవీలర్ మెకానిక్, హౌస్ వైరింగ్, ఎల్‌ఎంవీ డ్రైవింగ్, రిఫ్రిజిరేటర్, ఏసీ, టెక్నీషియన్, సీసీ టీవీ ఇన్‌స్టలేషన్, సర్వీసింగ్‌ల్లో శిక్షణ ఉంటుందన్నారు. విజయనగరం టీటీడీసీ మహిళ ప్రాంగణంలో ఇవ్వనున్న ఈ శిక్షణా కాలంలో వసతి, ఉచిత భోజనం కల్పిస్తారన్నారు. వివరాలకు 9959521662, 9985787820 నెంబర్లను సంప్రదించాలన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

దత్తిరాజేరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో శతశాతం గెలుపే లక్ష్యంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని మాజీ ఎంపీపీ, టీడీపీ మండల ఇన్‌చార్జి కొండపల్లి కొండలరావు పిలుపునిచ్చారు. మంగళవారం కోమటిపల్లి పెట్రోల్ బంకు వద్ద గల ఫంక్షన్ హాల్‌లో టీడీపీ కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, ఎన్నికల పరిశీలకుడు కర్రోతు శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జిలు మిత్తిరెడ్డి ఈశ్వరరావు, పెద్దింటి మోహన్, టీడీపీ జనరల్ సెక్రటరీ చెల్లూరి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా ముందుకు రాలే!

(5వ పేజీ తరువాయి)

పెరిగింది. అప్పటి రేట్ల ప్రకారం రూ. 7 కోట్లతో పనులు చేపట్టాలని నిర్ణయించారు. రాష్ట్రీయ శామ్ వికాశ్ యోజన (ఆర్‌ఎస్‌వీవై) నుంచి రూ. 3.50 కోట్లు, నాబార్డు నుంచి రూ. 3.50 కోట్లు మంజూరు చేశారు. నిర్మాణ బాధ్యతను ఎం/ ఎస్ వెంకట పాండురంగ కనస్ట్రక్షన్స్ (విశాఖ)కు అప్పగించారు. అయితే సకాలంలో పనులు ప్రారంభించక పోవడంతో వారి కాంట్రాక్టును రద్దు చేశారు.

● 2015 జనవరి 23న మళ్లీ కొత్త ఎస్టిమేట్లు వేశారు. రూ. 9.58 కోట్లతో అదే ఏడాది మే 25న ఎం/ఎస్ ఆర్‌ఆర్ ఇన్‌ఫ్రా వర్క్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు పనులు అప్పగించారు. 2017 మే 24 నాటికి పనులు పూర్తి చేయాలని మొదట నిర్ణయించారు. అయితే 2020, జూన్ 20 వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ధరలు పెరగడంతో రూ. 14 కోట్లకు రివైజ్డ్ అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ (ఆర్‌ఏఎస్) రూపంలో నిధులు పెంచారు. 2018 నాటికి 80 శాతం పనులు పూర్తయ్యాయి. 2019-2024 మధ్య కాలంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పూర్ణపాడు - లాబేసు వంతెన పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

జరిగిన పనులు ఇవీ..

పూర్ణపాడు-లాబేసు వంతెన పనులు నాగావళి నదిపై 11 పిల్లర్లతో నిర్మించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా 7వ పిల్లర్ నుంచి 11వ పిల్లర్ వరకు ఓపెన్ ఫౌండేషన్ శ్లాబ్ లెవెల్ పూర్తి చేశారు. రెండు అబుట్‌మెంట్లు, 12 శ్లాబ్‌లలో ఏడు శ్లాబులు పూర్తి చేశారు. పూర్ణపాడు వైపు 30 మీటర్ల వరకు ఎప్రోచ్ వాల్స్ పూర్తి చేశారు. ఒకటో స్తంభం వద్ద శ్లాబ్ కంటే కంచెం తక్కువ స్థాయి వరకు నిర్మాణం జరిగింది. మిగిలిన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. దీనిపై సంబంధిత కాంట్రాక్టర్‌కు పలుమార్లు నోటీసులు పంపినా ఎటువంటి స్పందన లేదు. పెండింగ్ బిల్లులు మంజూరుతో పాటు రీఎస్టిమేట్లు వేసి నిధులు పెంచకపోతే ఏమీ చేయలేమని సదరు కాంట్రాక్టర్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి మెయిల్ ద్వారా తెలియజేశారు. దీంతో మళ్లీ రూ.15.80 కోట్లు కావాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. మే 13న పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ సమావేశమై రూ.14 కోట్లతోనే పనులు చేయాలని ఆదేశించారు. రూ. 8కోట్లతో నిర్మాణాలు జరిగాయని, మరో రూ.7 కోట్లతో పనులు చేయాల్సి ఉందని అధికారులు ఇంజనీరింగ్ అండ్ చీఫ్‌కు తెలిపారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ విప్ జగదీశ్వరి ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి నిధులు పెంచాలని కోరగా.. రూ.15కోట్లు మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది.

టెండర్లు పిలిచినా..

వంతెన మిగిలిన పనులు పూర్తికి రూ.15 కోట్లతో రీఎస్టిమేట్లు వేయగా.. దీనికి పరిపాలన ఆమోదం లభించింది. ఇందులో గత కాంట్రాక్టర్ చేసిన పనులకు గాను ఈ ఏడాది ఆగస్టు 22న ఇంజనీరింగ్ రూ. 8.75 కోట్లు చెల్లించారు. మిగిలిన రూ.7.36 కోట్లతో ఎస్టిమేట్లు సిద్ధం చేసి సెప్టెంబరు 15న సాంకేతిక అనుమతి కోసం చీఫ్ ఇంజనీర్‌కు పంపించారు. దీంతో ఈ నెల 1 నుంచి 16 వరకు టెండర్లు పిలిచారు. అయితే కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. వాస్తవంగా రూ.7.36 కోట్ల అంచనా వ్యయంలో 18 శాతం ప్రభుత్వ పన్ను పోగా వంతెన పనులకు సంబంధించి రూ. 4.67 కోట్లు మాత్రమే కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సి ఉందని నిబంధన ఉంది. దీంతో నిధులు చాలవనే కారణంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు.

నిధులు పెంచాలని లేఖ రాస్తాం

పూర్ణపాడు-లాబేసు వంతెన పనులకు గాను రూ.7.36 కోట్లతో టెండర్లు పిలిచాం. కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని మరో 5శాతం నిధులు పెంచాలని ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ)కి లేఖ రాస్తాం.

- వీఎస్ నగేష్‌బాబు, డీపీఆర్‌ఈవో, పార్వతీపురం మన్యం జిల్లా

హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వద్దు

● మంత్రి సంధ్యారాణిని కోరిన గిరిజనులు



మంత్రి సంధ్యారాణితో గిరిజనులు

సాలూరు/మక్కువ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మక్కువ మండలంలోని దుగ్గేరులో హైడ్రో పవర్ ప్రాజెక్టును రద్దు చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని గిరిజనులు కోరారు. మంగళవారం సాలూరులోని మంత్రి కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పనసభద్ర పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన గిరిజనులు ఆమెకు వినతిపత్రం అందజేశారు. దుగ్గేరు ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయడం వల్ల పోడు వ్యవసాయం, కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న వారి బతుకులు రోడ్డున పడతాయన్నారు. గ్రామాలు ఖాళీ చేయాల్సి వస్తే పిల్లల భవిష్యత్ అగమ్యగోచరమవుతుందన్నారు. గిరిజనుల అభ్యర్థనపై మంత్రి సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దుగ్గేరు ప్రాంతంలో గిరిజనులకు నష్టం కలిగించే ఎలాంటి పనులు ఈ ప్రభుత్వం చేపట్టదని భరోసా ఇచ్చారు. పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేసేముందు అక్కడి ప్రజల అభిప్రాయాలను సేకరిస్తామన్నారు. వారి అభిప్రాయాలకు అనుగుణంగానే నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రజలకు ఇష్టం లేకుండా ఏ ప్రాజెక్టు కూడా ఏర్పాటు చేయమన్నారు. అందరూ ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీ ఆదివాసి జేఏసీ రాష్ట్ర కార్యదర్శి మండల గిరిధర్, పనసభద్ర పంచాయతీ టీడీపీ అధ్యక్షులు దీసరి నాగరాజు, కొండగొర్రి నాగేశ్వరరావు, సూకరాజు, సోమయ్య, రామారావు, నారాయణ, సోములు, ఉత్తరతో పాటు అధికసంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో 'దీపావళి'

● వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు



బాణసంచా కాలుస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి



విద్యార్థులతో ఎమ్మెల్యే విజయచంద్ర దంపతులు

పార్వతీపురం/బెలగాం/గుమ్మ లక్ష్మీపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఆనందంగా నిర్వహించారు. సాలూరులో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి, పార్వతీపురంలో కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి దీపావళి వేడుకలు జరుపుకున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులు వేడుకల్లో పాల్గొన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని నివాసంలో సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి దీపావళి వేడుకలు జరుపుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాల్చారు. నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని దేవుడిని ప్రార్థించినట్టు తెలిపారు. అలాగే, పార్వతీపురంలోని జ్యోతీరావుపూలే పాఠశాలలో సోమవారం రాత్రి ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తన కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి వేడుకలు జరుపుకున్నారు. పిల్లలతో కలిసి బాణసంచా కాల్చారు.

రూ. రెండు కోట్లకు పైబడి బాణసంచా విక్రయాలు..

జిల్లాలో సుమారు రూ. రెండు కోట్లకు పైబడి బాణసంచా సామగ్రి విక్రయాలు జరిగినట్టు సమాచారం. పార్వతీపురం, పాలకొండ, సాలూరు, కురుపాం తదితర ప్రాంతాలతో పాటు జిల్లాలోని ప్రాంతాల్లో బాణసంచా విక్రయాలు జరిగినట్టు తెలుస్తోంది.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న ఏడీ శ్రీహరిరావు

గరుగుబిల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఉపాధి హామీ పథకం ఏడీలు గుంట్రెడ్డి శ్రీహరిరావు, పి.త్రివిక్రమరావు అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోటపల్లి ప్రాజెక్టుకు అనుకుని ఉన్న పార్వతీపురం ఐటీడీఏ పార్కు, శంబర, సీతంపేటతో పాటు టీటీడీ కల్యాణ మండపం, మెట్టుగూడ అడవి తదితర ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. సుమారు 15 కిలోమీటర్ల పరిధిలో వివిధ రకాల మొక్కలను నాటేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. అలాగే శ్మశానవాటికలకు సంబంధించి 128 ప్రాంతాల్లో వెదురుతో కంచె నిర్వహణ, 307 చెరువుల గట్లుపై సీతాఫలంతో పాటు పలు రకాల మొక్కలను నాటేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీలు లేకుంటే మొక్కలతో బయో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో జి.పైడితల్లి, ఏపీవో ఈశ్వరమ్మ, ఇంజనీర్ డి.తేజేశ్వరరావు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ



పరామర్శిస్తున్న మేజిస్ట్రేట్ జె.సౌమ్య జాస్పిన్

బెలగాం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇటీవల జరిగిన మందు గుండు సామగ్రి పేలుడు ఘటనలో గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం అడిషనల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె.సౌమ్య జాస్పిన్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె.. వారి ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమెతో పాటు న్యాయసేవా కమిటీ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా వాల్ పోస్టర్ ఆవిష్కరణ

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి డిసెంబరు 13న గుంటూరులో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ఆవిష్కరించారు. క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్‌కుమార్ నాయక్, విజయనగరం జిల్లా బ్రాహ్మణ సంఘం నాయకులు ఇనుగంటి రాకేశ్, భగవాన్ మిశ్రా, వేల్పూరి గంగరాజు, పుట్రేపు సిద్ధు, అగస్త్య బన్నీ, పుల్లల శ్రీనివాసరావు, శేషు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

పాలకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నూతనంగా విధుల్లో చేరిన కలెక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డిని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను ఆయన సత్కరించారు. అనంతరం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన విషయాలపై కొద్దిసేపు చర్చించారు.

సమస్యలు పరిష్కారానికే ప్రజాదర్బార్

పార్వతీపురం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే వినతులను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

విద్యుత్ సమస్యలపై సమీక్ష

పార్వతీపురం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలపై ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మంగళవారం తన కార్యాలయంలో ట్రాన్స్‌కో డీఈతో సమీక్ష నిర్వహించారు. నర్సిపురం, పార్వతీపురం పట్టణం తదితర ప్రాంతాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు, బలిజిపేట మండలం పి.చాకరాపల్లి తదితర ప్రాంతాల్లో కొత్త లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. పి.చాకరాపల్లి నుంచి గౌరీపురానికి కొత్తగా రహదారి నిర్మాణం చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ స్తంభాల షిఫ్టింగ్‌కు చర్యలు చేపట్టాలని డీఈకి సూచించారు.

టీడీపీలో వంద కుటుంబాల చేరిక

పార్వతీపురం రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలల్లోనే అన్ని సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో మంజూరు చేయడంతో మేమంతా ఆనందం వ్యక్తం చేస్తున్నామని పార్వతీపురం మండలం కృష్ణపల్లి పంచాయతీ బండిదొరవలస గ్రామ ప్రజలు అన్నారు. మంగళవారం బండిదొరవలస గ్రామానికి చెందిన వంద కుటుంబాలు రెడ్డి శ్రీనివాసరావు, తురపడ గణేష్, బలగ శంకరరావు ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో ఎమ్మెల్యే విజయచంద్ర సమక్షంలో చేరారు. కండువాలు వేసి వారందరినీ పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. కార్యక్రమంల మండల పార్టీ అధ్యక్షుడు బోను చంద్రమౌళి, ఏఎంసీ మాజీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు, కూటమి నాయకులు టి.గణేష్, బి.శంకరరావు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో తనిఖీ

కురుపాం, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల గురుకుల పాఠశాలను మంగళవారం ఐసీడీఎస్ సీడీపీవో రజనీ దుర్గ, ఏటీడబ్ల్యూవో కె.చంద్రబాబు, సచివాలయం సిబ్బంది తనిఖీ చేశారు. పాఠశాలలో పారిశుధ్యం, విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఉన్నారు.

విద్యార్థులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

గరుగుబిల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో విద్యార్థులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో జి.పైడితల్లి, ఎస్ ఫకృద్దీన్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహంలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారన్న దానిపై ఆరా తీశారు మరుగుదొడ్ల నిర్వహణతో పాటు పరిసరాల శుభ్రతను పరిశీలించారు. మెనూలో లోపాలు ఉంటే సహించేది లేదన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలన్నారు. వసతిగృహాల లోపాలపై నివేదికలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. పరిశీలనలో వసతిగృహ వార్డెన్ ఎస్.శ్రీనివాసరావు ఉన్నారు.

●కురుపాం, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లకు ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ విద్యార్థులకు ఎటువంటి చిన్నపాటి అనారోగ్యం కలిగినా దగ్గరలో పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు ప్రతిరోజు ఆటలు ఆడించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఎన్.సత్యనారాయణ, ఏటీడబ్ల్యూవో కె.చంద్రబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వేణుగోపాలరావు పాల్గొన్నారు.

●మక్కువ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆశ్రమ పాఠశాల, కస్తూర్బా, మోడల్ స్కూల్, రెసిడెన్షియల్, పాఠశాలల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రధానోపాధ్యాయులు, పిన్సిపాల్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మండల నోడల్ అధికారి కె.సి.రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్ లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ భాను

పాలకొండ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ బొమ్మాళి భానుసుధాకర్ ఆదేశించారు. నవగాంలోని సచివాలయాన్ని ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. సచివాలయ పరిధిలోని గ్రామాల ప్రజలకు ప్రభుత్వ సేవలు పక్కాగా అమలు చేయాలన్నారు. సచివాలయంలోని వాష్ రూమ్, కాంపౌండ్ వాల్‌ను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి వాష్‌రూమ్‌లు మరమ్మతులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ అదనపు అభివృద్ధి అధికారి కృష్ణారావు, పాలకొండ మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు జాడ శ్రీధర్, సర్పంచ్‌లు, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

●రూ. 14.50 కోట్లతో త్వరలో పనులు ప్రారంభం



అధ్వానంగా ఉన్న దుగ్ధసాగరం రోడ్డు

సాలూరు రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఐదు గిరిజన ప్రాంతాలకు వెళ్లే గ్రామీణ రోడ్లు పనులు రూ. 14.50 కోట్లతో కొద్దిరోజుల్లో చేపట్టనున్నారు. జాతీయ రహదారి 26 నుంచి దుగ్ధసాగరం మీదుగా పాచిపెంట మండలం పూడి వరకు రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ. 3 కోట్లు మంజూరు చేసింది. అలాగే సారిక నుంచి తురాయిపాడు రోడ్డు నిర్మాణానికి రూ. 2.20 కోట్లు మంజూరయ్యాయి. ముక్కాయవలస నుంచి మడవలస వరకు రూ. 1.30 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. పాచిపెంట మండలం పూడి నుంచి నంద పణుకువలస వరకు రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరైంది. నందేడువలస నుంచి వయా పందిగుమ్మిపాడు, సుల్లారి మీదుగా సీకుపాడుకు రూ. 5 కోట్లతో రోడ్డు నిర్మించనున్నారు. ఈ రోడ్ల పనులకు టెండర్లు ఖరారైనట్టు ఐటీడీఏ పి.కోనవలస డీఈ సంతోష్‌కుమార్ పట్నాయక్ మంగళవారం తెలిపారు.

క్రీడా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

బెలగాం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడారులు నుంచి అర్జున, మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్‌రత్నా, ద్రోణాచార్య, రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహ పురస్కారాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి కె.శ్రీధర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 28లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నాగేశ్వరరావుకు నివాళి



నాగేశ్వరరావు చిత్రపటం ఎదుట నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

సాలూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీ, శ్రీలక్ష్మీ థియేటర్ వద్ద అర్బన్ దివంగత బ్యాంకు చైర్మన్, మున్సిపల్ మాజీ చైర్మన్ పువ్వల నాగేశ్వరరావు స్మారక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి జడ్పీ చైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు పార్టీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పరీక్షిత్ రాజు, మాజీ ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర తదితరులు పాల్గొన్నారు. పలువురు నాయకుల, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షాలు తగ్గితే టిడ్కో పనులు చేపడతాం

సాలూరు, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే టిడ్కో అభివృద్ధి పనులు చేపడతామని డీఈ శశిధర్ తెలిపారు. వేగావతి నది నుంచి టిడ్కో భవన సముదాయానికి నిర్మిస్తున్న రక్షిత నీటి పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. గుమడాం రైల్వే లైను క్రాసింగ్‌తో పాటు అనేక చోట్ల రక్షిత నీటి పథకానికి సంబంధించి పూర్తిస్థాయిలో పనుల జరగాల్సి ఉందన్నారు. ఆయన వెంట ఏఈ స్వాతి, పలువురు అధికారులు ఉన్నారు.

ఘనంగా సంస్మరణ వారోత్సవాలు

సాలూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మండల రెవెన్యూ కార్యాలయం ఆవరణలోనిన దివంగత సీఐ ముద్దాడ గాంధీ విగ్రహానికి పట్టణ సీఐ బి.అప్పలనాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో మెయిన్ రోడ్డులో బోసుబొమ్మ కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసుల సేవలు చిరస్మరణీయమన్నారు. సమాజాన్ని సంస్కరించడంలో పోలీసుల పాత్ర చాలా గొప్పదన్నారు. కార్యక్రమంలో పలువురు పోలీసులు పాల్గొన్నారు.

వ్యాధి లక్షణాలను గుర్తించండి



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ జగన్మోహనరావు

సీతానగరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వ్యాధి లక్షణాలను పక్కాగా గుర్తించడంతో పాటు అందుకు తగిన చికిత్స అందించాలని జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. బుధవారం ఆయన సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. చికిత్సల వివరాలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జోగింపేట కేజీబీవీని సందర్శించారు. విద్యాలయం ఎరిసరాలు, సిక్ రూము, సిక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. తాగునీటి ఆర్‌వో ప్లాంటును పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ సుశీల, సీహెచ్‌వో ఎస్వీ రమణ, ప్రిన్సిపాల్ జె.సంధ్య తదితరులు ఉన్నారు.

ఈశ్వరయ్య ఎన్నికపై హర్షం

పార్వతీపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా గుజ్జుల ఈశ్వరయ్య ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో పార్వతీపురం మన్యం జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు ఆర్.వి.ఎస్.కుమార్, ఇ.వి.నాయుడు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం వారు పట్టణంలో విలేకరులతో మా ట్లాడారు. ఈశ్వరయ్యకు జిల్లాలో సమస్యలపై ఆయన అవగాహన ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి దుర్గారావు, యూత్ నాయకులు సింహాద్రి, కిరణ్, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు రవికుమార్ తదితరులున్నారు.

ఘాట్ రోడ్డులో లారీ బోల్తా

● రాకపోకలకు అంతరాయం

పాచిపెంట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రొడ్డవలస సమీపంలోని ఘాట్ రోడ్డులో సోమవారం రాత్రి విశాఖపట్నం నుంచి ఒడిశా వెళుతున్న హెచ్‌పీ గ్యాస్ లారీ బోల్తా పడింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. లారీని బయటకు తీసే క్రమంలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఘాట్ రోడ్డుపైకి వాహనాలు వెళ్లక ముందే పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద వాటిని పోలీసులు నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

140 లీటర్ల సారా స్వాధీనం

పార్వతీపురం టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో 140 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శిరీష తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని పాతరెల్లివీధిలో చేపట్టిన దాడుల్లో సొండి లక్ష్మణ నివాసంలో ఏడు క్యాన్లతో సుమారు 140 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాంతో లక్ష్మణపై కేసు నమోదు చేశామన్నారు. అతడి ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశామన్నారు. దాడుల్లో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సీఐ శేఖర్‌బాబు, ఎస్‌ఐలు చంద్రకాంత్, రేవతమ్మ, శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టండి



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ పీవో రజనీదుర్గ

జియ్యమ్మవలస, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కురుపాం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి జి.రజనీదుర్గ పిలుపునిచ్చారు. మంగళవారం ఆమె చినమేరంగి కేజీబీవీలో విద్యార్థులతో బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. చదువు, ఉద్యోగం, ఉపాధి వంటి అన్ని రంగాల్లో మగవారితో సమానంగా రాణించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి.జానకి, జిల్లా బాలికల సంరక్షణ విభాగం లీగల్ అధికారి పి.శ్రీధర్, ఔట్ రీచ్ వర్కర్ హరికృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.